క్లుప్తంగా

ఫైనల్ లిస్ట్ ప్రదర్శన



కందుకూరులో ఓటర్ లిస్ట్‌ను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సరిత తదితరులు

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల ఫైనల్ లిస్టును పబ్లిష్ చేశారు. మొత్తం 35 జీపీల పరిధిలో 16 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 51,706 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 21865, స్త్రీలు 25841 మంది ఉన్నారని, 92 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సులోచన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

పహాడీషరీఫ్: నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మహిళా కానిస్టేబుళ్లు ప్రతిభ, శివానీలు దేవేందర్ నగర్ కాలనీలో సైకిల్‌పై పెట్రోలింగ్ నిర్వహిస్తూ స్థానికులకు నేరాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో ఎవరైనా డయల్–100 కాల్ చేయడం ద్వారా పోలీసులు సకాలంలో చేరుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో సైబర్ నేరాలు జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. రద్దీ ప్రాంతాలలో చైన్ స్నాచర్ల బెడద నుంచి తప్పించుకునేలా నగలు కనిపించకుండా వస్త్రాన్ని కప్పుకోవాలన్నారు. ఇంట్లో చిన్నారులు మాదక ద్రవ్యాల వైపు దారి మళ్లకుండా ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని జయశంకర్ కాలనీ, వైఎస్ఆర్ నగర్ కాలనీలల్లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందన్నారు. గతంలో పేదలకు ఇందిరమ్మ పేరుతో ఇళ్ల జాగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కాలనీవాసులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



కృష్ణను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కృష్ణ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ బషీర్, రికార్డు అసిస్టెంట్ హోసునుద్దీన్ పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

చంపాపేట: ఆలయ ప్రతిష్ట దెబ్బతీసేందుకే కొందరు కుట్రపూరితంగా భక్తులకు కుళ్లిన పులిహోర ప్రసాదాన్ని అందచేస్తున్నారని కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ ప్రసాదాల వంటగది ఇన్‌చార్జి రమాదేవి పేర్కొన్నారు. ఆలయ వంటగదిని నిత్యం ప్రసాదాల తయారీకి ముందే శుభ్రం చేస్తామని ఏరోజు ప్రసాదాలు ఆరోజే భక్తులకు అందజేస్తామన్నారు. ఇంత వరకు బాధిత భక్తుడు కుళ్లిన పులిహోర ప్రసాదంతో పాటు కార్యాలయంలో ఫిర్యాదు చేసిన దాఖలాలు లేవన్నారు.



ఖాళీగా వైద్యుడి సీటు



నాడు వేసిన శిలాఫలకం

వైద్యుడు లేక.. సేవలు అందక

నాదర్‌గుల్ హోమియో దవాఖానాలో సిబ్బంది కొరత

- తీవ్ర అవస్థలు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



నాదర్‌గుల్‌లోని ప్రభుత్వ హోమియో వైద్యశాల భవనం

బడంగ్‌పేట్: రోగుల నాడి పట్టే నాథుడు లేక నాదర్‌గుల్‌లోని ప్రభుత్వ హోమియో వైద్యశాల వెలవెలబోతోంది. గత ఐదు నెలలుగా సిబ్బందితో కొరతతో రోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిత్యం సుమారు 80 నుంచి 100 మంది వరకు రోగులు ఆస్పత్రికి వైద్యం కోసం వస్తున్నప్పటికీ చికిత్స అందించే వైద్యులు లేక నిరాశతో వెనుదిరిగిపోతున్నారు. రోగమొస్తే ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే ఫీజుతో పాటు ఇష్టమొచ్చిన మందులు రాసి జేబులు ఖాళీ చేస్తున్నారని ప్రభుత్వ దావఖానాకు వస్తే డాక్టర్లు అందుబాటులో లేని దుస్థితి దాపురించింది.

1998లో ఏర్పాటు

నాదర్‌గుల్‌వాసులతో పాటు కమ్మగూడ తదితర ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. నాడు ఇంగ్లిష్ మందులు(టాబ్లెట్స్) అందుబాటులో లేని సమయంలో యునాని, హోమియో లాంటి వైద్యశాలలను ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. నాదర్‌గుల్‌లో 1998లో హోమియో వైద్యశాలను ప్రారంభించారు. వైద్యుల కొరత ఏర్పడి అన్ని ప్రభుత్వ హోమియో దావఖానాలు మరుగున పడుతున్నాయి. హోమియో వైద్యానికి అలవాటు పడిన రోగులను దృష్టిలో పెట్టుకుని వైద్యాలయంలో వైద్యుడితో పాటు ఇతర సిబ్బందిని నియమించాలని స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

వైద్యుడిని నియమించాలి



చాలా ఏళ్లుగా ఈ మందులనే వాడుతున్నా. మా కుమారులు ఇంగ్లిష్ మందులు వాడొద్దన్నారు. ఎలాంటి నొప్పులు లేవు. డాక్టర్ లేక చాలా నెలలైంది. సిస్టరే అందరికీ మందులు ఇస్తుంది. కొంచెం లేటుగానైనా రోగం నయం అవుతున్నది. సైడ్ ఎఫెక్ట్ ఏమీ రాలే. వెంటనే వైదుడిని నియమించాలి.

– అంజమ్మ, నాదర్‌గుల్‌వాసి

మున్సిపల్ అధికారులకు సత్కారం



మున్సిపల్ అధికారులను సన్మానిస్తున్న బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు

పహాడీషరీఫ్: బాలాపూర్ వినాయక నిమజ్జన శోభ యాత్ర రూట్‌లో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా సదుపాయాలు కల్పించిన జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులను ఉత్సవ సమితి తరఫున సన్మానించారు. సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలోని సభ్యులు జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేకాధికారి జి.వెంకట నారాయణ, కమిషనర్ బి.వెంకట్రామ్‌లను శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

వీరేందర్‌గౌడ్‌కు పలువురి శుభాకాంక్షలు




వీరేందర్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మహేశ్వరం: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తూళ్ల వీరేందర్‌గౌడ్‌ను ఆ పార్టీ అమీర్‌పేట్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరేందర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బలహీనవర్గాలకు చెందిన వారికి పార్టీ పదవుల్లో బీజేపీ అధిక ప్రాధాన్యత కల్పించి గౌరవిస్తుందని అమీర్‌పేట్ మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. మహేశ్వరం మండలానికి చెందిన తూళ్ల వీరేందర్ గౌడ్‌కు తెలంగాణ బీజేపీ కార్యవర్గంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి బాధ్యతలు అధిష్టా నం అప్పగించడం అభినందనీయమన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని వీరేందర్‌గౌడ్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిహెచ్. యాదయ్య, ఇమ్మడి శ్రీనివాస్, చాకలి సత్తయ్య, చాకలి భిక్షపతి పలువురు పాల్గొన్నారు.

వీరేందర్‌గౌడ్‌కు సన్మానం

తుక్కుగూడ: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తూళ్ల వీరేందర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మంఖాల్ నాయకులు తుక్కుగూడ పురపాలిక పరిధిలోని శ్రీనగర్ ఆయన నివాసంలో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రాజ్, శ్రీనివాస్ యాదవ్, రమాకాంత్‌గౌడ్, నర్సింహగౌడ్, అన్వేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పోరాటాలతోనే బీసీలకు రాజ్యాధికారం



ఆత్మీయ సమ్మేళనంలో బీసీ సంఘాల నేతలతో కృష్ణయ్య

మన్సూరాబాద్: బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేస్తే రాజ్యాధికారం సిద్ధిస్తుందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. బీసీ యునైటెడ్ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అయితగోని రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో బుధవారం బీసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం కోసం జరిగే పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. 60 శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగుతున్న వారి ప్రయత్నాలు నెరవేరటం లేదన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై గత కొన్ని సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటాలు చేశామని గుర్తుచేశారు. బీసీలకు రావాల్సిన వాటాలపై జాతీయ స్థాయిలో పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాలూరి రామకృష్ణయ్య, పాలూరి లక్ష్మి, పల్లె రవికుమార్, గుజ్జ సత్యం, డాక్టర్ కాసోజు విద్యారాణి, కుమార్ గార్కె, వేములకొండల్, శేఖర్‌గౌడ్, అంజయ్య, చంద్రపాల్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ట్రంక్ లైన్ల పనులను పరిష్కరించాలని కోరారు.బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ నుంచి హరిహరపురం కాలనీ వరకు గుర్రంగూడ అటవీశాఖ మీదుగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులను అటవీశాఖ అధికారులు నిలిపి వేశారని వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు.వినతి ఇచ్చిన వారిలో అరవింద్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, ముత్యంరావు ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కందుకూరు: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కవిత డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్ అధ్యక్షతన మండల కేంద్రంలో మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో వారు మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు చాలీచాలని వేతనాలతో అదనపు పని భారంతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, గతంలో చేసిన సమ్మె రోజులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. ఖాళీ ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వరం ప్రాజెక్టు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించారు. ప్రాజెక్టు అధ్యక్షురాలిగా లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా సుమతి, కోశాధికారిగా తేజ, ఉపాధ్యక్షులుగా యశోధ, మంజుల, రాధికను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు యాదమ్మ, పుష్పలత, సరస్వతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి సహకరించండి



అందెలకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు: శ్రీశైలం హైవే అవేర్ ఆస్పత్రి నుంచి లేమూరు మీదుగా తిమ్మాపూర్ వరకు అటవీ భూముల నుంచి నూతన రహదారి నిర్మించేలా నిధులు మంజూరు చేయడానికి కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని బుధవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్‌ను ఆయా గ్రామాలకు చెందిన నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. అటవీ భూమలు నుంచి ఉన్న మట్టి రోడ్డుకు అనుమతులు ఇచ్చి రహదారిని నిర్మిస్తే లేమూరు, భైరాగిగూడ, రాచులూరు, తిమ్మాపూర్ గ్రామాలకు శ్రీశైలం రహదారి వరకు రాకపోకలు సాగించడానికి సులభం అవుతుందని తెలిపారు. సంబంధిత కేంద్ర మంత్రులతో మాట్లాడి నిధులు మంజూరైయ్యేలా చూస్తానని అందెల వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర డెయిరీఫాం కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అంజనేయులు, నాయకులు వెంకటేష్, శివప్రసాద్, గంగపుత్ర మహేష్, పి.శివ, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట: నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ నర్సింహ తదితరులు



మీర్‌పేట: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం, రజక సంఘం నాయకులు



మహేశ్వరం: ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్
- వీరవనితకు ఘన నివాళి



తుక్కుగూడ: ఐలమ్మ వర్ధంతిలో మాజీ మంత్రి సబితారెడ్డి, నాయకులు

తుక్కుగూడ: తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ, ఆమె స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. తొలి తెలంగాణ పోరాటానికి నాంది పలికిన విప్లవ నిప్పుకణిక ఐలమ్మ అన్నారు. ఆమె పోరాటం నేటి సమాజానికి ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ తుక్కుగూడ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య, మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పునూతల శ్రీనివాస్, బీఆర్ఎస్, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీరనారి త్యాగం మరువలేనిది

హుడాకాంప్లెక్స్: భూమి కోసం, భుక్తి కోసం వీర వనిత చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. పార్టీ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ ఆధ్వర్యంలో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఎండీ షైమిదా, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, సీపీఐ మాజీ ఎంపీటీసీ ఆర్.గోపాల్, జోజి తదితరులు పాల్గొన్నారు.

దొరలను గజగజ వణికించింది

మహేశ్వరం: నైజాం నవాబుకు వ్యతిరేకంగా ఉద్యమించిన వీర వనిత చాకలి ఐలమ్మ అని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గరీబు కులంలో జన్మించి నైజాం దొరను గజగజ వణికించిన ఘనత ఐలమ్మకే దక్కుతుందన్నారు. భూమి కోసం భుక్తి కోసం ఆమె చేసిన పోరాటం సమజానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు యాదయ్య, అంబయ్యయాదవ్, నవీన్, దత్తు నాయక్, లాజర్, శంకర్, కుమార్, సాంబయ్య, కృష్ణ, సుభాష్ పాల్గొన్నారు.

అమీర్‌పేట్ గ్రామంలో...

అమీర్‌పేట్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చాకలి ఐలమ్మను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహేశ్వరం: అమీర్‌పేట్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం

చందన చెరువు కట్టపై..

మీర్‌పేట: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మీర్‌పేట మాజీ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ అన్నారు. జిల్లెలగూడ చందన చెరువు కట్టపై బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ సంస్మరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, సి.మల్లేశ్, అరవింద్, భీమరాజు భిక్షపతి, పుప్పాల రామకృష్ణ, శంకర్, ఐతరాజు, బంగారు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట కూడలిలో..

సీపీఎం, రజక సంఘం ఆధ్వర్యంలో మీర్‌పేట కూడలి వద్ద ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి బాబు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల ఉమేశ్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, ప్రకాశ్, రమేశ్, ఎస్.యాదగిరిచారి తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ త్యాగం ఆదర్శం

కందుకూరు: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం కందుకూరు చౌరస్తాలో రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, రాష్ట్ర నాయకులు బి.మల్లేష్, శ్రీనివాస్, కుమార్, బాలరాజ్, సుధాకర్, గోపాల్, సీపీఎం నాయకులు రాంచందర్, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గూడూరులో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించిన కార్యక్రమంలో ఆ గ్రామ రజక కమిటీ సభ్యులు కె.కుమార్, పి.కృష్ణ, ఏ.శ్రీను, కె.శ్రీను, పి.సురేందర్, కె.దర్శన్, కె.అరవింద్, కె.భానుప్రసాద్ పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో ఐలమ్మ వర్ధంతిలో పాల్గొన్న బొమ్మగాని ప్రభాకర్ తదితరులు



కందుకూరు చౌరస్తాలో..



కందుకూరు: గూడూరులో..